ప్రజాశక్తి
మంగళవారం 31 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

మహాత్మాగాంధీకి నివాళి

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా బాపట్ల కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్రపటానికి కలెక్టర్ విజయ కృష్ణన్, డి.ఆర్.ఒ కె.లక్ష్మీశివజ్యోతి, జిల్లా అధికారులు పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీల ద్వారా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజల విజ్ఞప్తులను సావధానంగా విన్న కలెక్టర్ తక్షణమే స్పందించి.. సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

'వెలిగొండ'ను
త్వరగా పూర్తి చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

5లో

'చోరీల' నేరం ఎవరిది?

- జిల్లాలో పెరుగుతున్న దొంగతనాలు
- ఉపాధి లేక పెడదారి పడుతున్న వైనం
- జనం లేని ఇళ్లు..గుళ్లలో హుండీలే లక్ష్యం
- ఆర్థిక పరిస్థితులు దిగజారుడుకు దర్పణం ఇదే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

- గిద్దలూరు, కంభం, మార్కాపురం, శింగరాయకొండ పట్టణాల్లో ఇటీవల కాలంలో వరుసగా దొంగతనాలు జరిగాయి. ఇళ్లలో జనం లేని సమయాల్లో దొంగలు తాళాలు పగలగొట్టి అందినకాడికి దోచుకునిపోతున్నారు.
- ఒంగోలు, మంగమూరు డొంకలోని మర్రిచెట్టు వద్ద ఆంజేయస్వామిగుడిలోని హుండీనే ఎత్తుకుపోయాడు ఓ అంగతకుడు. ముండ్లమూరు మండలం, వేంపాడు గ్రామంలో ఇటీవలే రామాలయం, ఆంజనేయస్వామి గుడిలోని రెండు కానుకల హుండీలను ఎత్తుకుపోయారు.
- అనేక చోట్ల ఇళ్లలోని నీళ్ల కుళాయిల మోటార్లు ఎత్తుకుపోతున్నారు.
- నిత్యం జిల్లాలో రోజుకు పది నుంచీ పాతికకు పైగా దొంగతనాల కేసులు నమోదవుతున్నాయి.

జిల్లాలో వరుస దొంగతనాలు అందరినీ కలవర పెడుతున్నాయి. సాధారణ దొంగతనాలు ఎప్పుడూ జరుగుతుంటాయి. కొన్ని ప్రత్యేక పరిస్థితులు వచ్చి నపుడు కూడా ఏ మార్గం లేక కొందరు దొంగతనాలకు పాల్పడుతుంటారు. పూర్వం కరువు రోజుల్లో తినడానికి గింజలు లేనప్పుడు దొంగతనాలు జరిగేవంటారు. ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేనప్పుడే ఇలాంటివి ఎక్కువగా జరుగుతుంటాయి. సంఘటనలకు వెనుకున్న కారణా లను విశ్లేషిస్తేనే వాస్తవాలు వెలుగులోకొస్తాయి.

ఒంగోలులోని ఆంజనేయస్వామి గుడిలోని హుండీని తీసుకెళుతున్న దొంగ (ఫైల్)

ప్రస్తుతం అనేకచోట్ల దొంగ తనాలు ఆందోళన కలిగిస్తు న్నాయి. కారణం పేదలకు సరైన పనులు లేవు. ఉపాధి లేదు. ఖాతాల్లో సంక్షేమ పథకాలకు ఎంతో కొంత డబ్బులు వేస్తున్న ప్రభుత్వం శాశ్వత ఉపాధిపై దృష్టి పెట్ట లేదు. ఇప్పటికే పశ్చిమాన ఉపాధి పనులు కూడా లేక వలసలు మొదలయ్యాయి. లారీలో ఎక్కి ఇతర ప్రాం తాలకు తరలిపోతున్నారు. ఇక గ్రామాల్లో చూస్తే ఆర్థిక పరిస్థితులు కిటకిట లాడుతున్నాయి. కొన్ని రంగాల్లో సంక్షోభం ప్రభావం దిగువస్థాయిలో పేదలపైనా పడుతోంది. ఒకవైపు ఆర్థిక సంక్షోభాలతో సాఫ్ట్‌వేర్ రంగమే తిరోగమనం వైపు నడుస్తోంది. ప్రవాసాంధ్రుల నుంచి గ్రామాలకు డబ్బులు రావడం లేదు. మొన్నటి వరకు గ్రామాల్లో ఎకరం రూ.ఐదు లక్షలున్న పొలాలు పాతిక లక్షలకు పోయింది. రోడ్డు మార్గంలో ఉండే భూములకు, ఇళ్ల స్థలాలకు భారీగా గిరాకీ పెరిగింది. భారీగా కొత్తకొత్త భవనాలు కట్టారు. ఇపుడు పరిస్థితి బోర్లాపడింది. ఆ ధరలు లేవు. వ్యాపారాలు లేవు. అన్నీ తగ్గిపోయాయి. రూ.రెండు వేల నోట్లు చూసిన జనం ఇపుడు వందకు ఎదురుచూడాల్సిన పరిస్థితి. మధ్యతరగతి వర్గాల ఆదాయాలు తగ్గాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఆగిపోవడంతో అన్ని రంగాలపైనా ప్రభావం పడింది. ఈ తరుణంలో ఆర్థిక పరిస్థితులు క్షేత్రస్థాయిలో గడ్డుగా మారాయి. ఏదీ దొరక్కే దొంగతనాలకు పాల్పడుతున్నారు. జరిగే సంఘ టనలు చూస్తే బాధితులు కూడా సామాన్యులే. చిన్నచిన్న ఇళ్లలోనూ దొంగతనాలు జరుగుతున్నాయి. కొత్తగా ఎవరైనా ఇల్లు కట్టుకునేందుకు బోరు వేసి మోటారు పెడితే తెల్లారేసరికి ఆ మోటారు కనిపించడం లేదు. బయట ఏ వస్తువు ఉన్నా తెల్లారేసరికి పోతోంది. వీటిని తీసుకుపోయి ఎంతవస్తే అంతకు ఎవరికో ఒకరికి అమ్ము తున్నారు. ఇవన్నీ చిల్లర దొంగతనాలుగా ఉన్నాయి. అందరూ జిల్లాలోని స్థానికులే.. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే కరుడు కట్టిన దోపిడీ దొంగలైతే కాదు. ఈ సంఘటనలు పోలీసులకు సవాలుగా మారాయి. కొన్ని కేసుల్లో పురోగతి సాధించినా ఇలాంటివాటిని ఎలా నియంత్రించగరన్నదే ప్రశ్నగా మారింది. అందరికీ ఉపాధి, వేతనాలు అందుబాటులో ఉంటేనే ఇలాంటివి తగ్గుతాయని పాలకులు గురించాలి. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాల్సిన అవసరం ఉంది.

మళ్లీ పొగాకు సాగుకు సిద్ధం

- తొలిసారి 'మాండూస్'తో దెబ్బతిన్న పంట
- రెండో విడత పంటను కాపాడుకొనేందుకు రైతుల యత్నాలు
- అరక సాగుకు సిద్ధమైన కర్షకులు

ఎం.నిడమలూరు సమీపంలో రెండో విడత సాగు చేసిన పొగాకు పంటలో అరక దున్నుతున్న రైతు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలో అత్యధిక శాతం మంది రైతులు పొగాకు సాగు పైనే ఆధారపడి జీవిస్తున్నారు. తొలి దశలో మండలంలో 7500 ఎకరాలలో రైతులు పొగాకు సాగును చేపట్టారు. చేతికొచ్చిందనుకున్న పొగాకు గత నెలలో సంభవించిన మాండూస్ తుఫాను విపత్తుకు మొత్తం చేజారింది. అధికారులు, పాలకులు తమను పట్టించుకోవట్లేదని భావించిన పొగాకు రైతులు రెండో విడత సాగు చేపట్టారు. నానా తంటాలు పడి మళ్లీ తొలి నుండి పొగాకు సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం పొగాకు కొంత ఆశాజనకంగానే ఉన్నట్లు రైతులు భావిస్తున్నారు.

తొలి విడత వేసిన పొగాకు పంట మాండూస్ తుపాన్ వల్ల కుళ్ళిపోయి నేలవాలి పనికిరాకుండా పోయాయి. ఆ విపత్తును తట్టు కునేందుకు పొగాకు రైతులు చేయని ప్రయత్న మంటూ లేదు.. అప్పటినుండి ఇప్పటివరకూ కూడా వ్యవసాయ అధికారులకు, రాజకీయ పార్టీల నాయకులకు, బోర్డు అధికారులకు తమ గోడు వెళ్ళబోసుకుంటూనే ఉన్నారు. పొగాకు బోర్డు నుండి ఒక్కో బ్యారన్ రైతుకు కనీసంగా రూ.50 వేల వడ్డీ లేని రుణాన్ని ఇచ్చి రైతులను ఆదుకోవాలని బోర్డు అధికారులకు పదేపదే విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఫలితంగా పొగాకు బోర్డు నుండి కేవలం రూ.10 వేల వడ్డీ లేని రుణాన్ని రైతులకు ఇచ్చేందుకు బోర్డు అధికారులు అంగీకరించారు. ఈ ప్రకటనపై కూడా రైతులు తీవ్రంగా స్పందించారు. రైతుల నుండి అపరాధ రుసుము కింద వసూలు చేసిన సొమ్మే కొన్ని వేల కోట్లు బోర్డులో ఉందని, రూ.10 వేల వడ్డీ లేని రుణంతో రైతులకు ఏం ప్రయోజనం అని రైతుసంఘాల నాయకులు అధికారులను ప్రశ్నించారు. అక్కడక్కడా పొగాకు రైతులు బోర్డు అధికారులను నిలదీసిన ఘటనలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ బోర్డు అధికారులు పట్టిన పంతం విడువలేదు.

రెండో విడత సాగుకు సిద్ధం

అధికారులు, పాలకులు తమను పట్టించుకోవటం లేదని భావించిన పొగాకు రైతులు రెండో విడత సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం రెండో విడతలో దాదాపు 4000 ఎక రాలకు పైగా మండలంలోని రైతులు పొగాకు సాగు చేపట్టారు. ప్రస్తుతం పొగాకు కొంత ఆశాజనకంగానే ఉన్నట్లు భావిస్తున్నారు. టంగుటూరుకు చెందిన పొగాకు రైతు కంద్రా శ్రీనివాసులు తాను తొలి దశలో 30 ఎకరాలు పొగాకు సాగు చేయగా 20 ఎకరాలకు పైగా మాండూస్ తుఫానుకు దెబ్బతిందని వాపో యారు. పొగనారు తెచ్చి మళ్లీ రెండో విడత సాగు చేశానని, ప్రస్తుతం పొగాకు కొంత ఆశా జనకంగానే ఉందని వివరించారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

చేతివృత్తుల వారికి ప్రభుత్వం అండ

- కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్
- 'చేదోడు' చెక్కులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. 'చేదోడు పథకం'లో భాగంగా లబ్ధి దారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సోమ వారం మూడో విడత డబ్బులు జమ చేస్తున్న సందర్భంగా పల్నాడు జిల్లా, వినుకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అను బంధంగా కలెక్టరేట్ ప్రత్యేక కార్యక్రమం నిర్వ హించారు. కలెక్టర్‌తో పాటు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించిన అనంతరం లబ్ధిదారులకు వీరు బ్యాంకు చెక్కును అందించారు. తొలుత గాం ధీజీ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాల వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకంలో లబ్ధిదారులైన 14,527 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.14.52 కోట్ల మేరకు ప్రయోజనం కలిగినట్లు తెలిపారు. వీరిలో నాయీ బ్రాహ్మణులు 1,771, రజకులు 2,949, దర్జీలు 9,807 మంది ఉన్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని మెరుగైన జీవనోపాధి కోసం వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ అన్ని వర్గాల సం క్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ క్యాలెం డర్ ప్రకారం పథకాలను అమలు చేస్తున్నా రన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే 2లో

చేతి వృత్తుల వారికి ప్రభుత్వం అండ

(మొదటిపేజీ తరువాయి)

బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి వివక్షకూ, లంచాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్ సొంతమన్నారు. చేతివత్తిదారులకు పరికరాలు కాకుండా వారి అవసరాలకు ఉపయోగపడేలా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. బిసి కులాలకు ఒంగోలులో ఆరామ క్షేత్రాలు కూడా నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, పి.డి.సి.సి. బ్యాంకు ఛైర్మన్ మాదాసి వెంకయ్య, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కె.కనకారావు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-వేటపాలెం

హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బండ్ల బాపయ్య హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం సోషల్, నేచురల్ సైన్స్, సబ్జెక్టులకు సంబంధించిన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించారు. అసోసియేషన్ మిత్రులు ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం చేశారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు పూట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వీరు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నాగరాజు, అసోసియేషన్ ప్రెసిడెంట్ సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బొడ్డు శివయ్య, సభ్యులు వై కెవి సోమరాజు, పి సుధాకర్ రెడ్డి, బుద్ధి రవి, బుద్ధి శ్రీను, డాక్టర్ మధు, మస్తాన్, వల్లంపట్ల సురేష్, బాలాజీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు పూట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కారంచేడు

కుష్టు వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని దగ్గుబాడు ఆయుర్వేద వైద్యులు అన్నారు. మండలంలోని దగ్గుబాడు గ్రామపంచాయతీ వద్ద సోమవారం నాడు కుష్టువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శరీరం పైన ఏమైనా మచ్చలలాంటివి ఏర్పడినప్పుడు వైద్యుని సలహాతో మందులు వాడాలని చెప్పారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దగ్గుబాడు పంచాయతీ కార్యదర్శి జోష్ణ, ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ ఉద్యోగులు, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మద్దిపాడు: కుష్ఠ వ్యాధి లేని సమాజాన్ని తయారు చేద్దామని స్థానిక పిహెచ్‌సి డాక్టర్ డి మానస పిలుపు నిచ్చారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరిం చుకొని కుష్ఠ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. మండల పరిధిలోని వెల్లంపల్లిలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు పదిహేను రోజుల పాటు మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తమవంతు సహకారం అందించాలని కోరారు. కుష్ఠ వ్యాధి ఎలా వస్తుంది, వ్యాధిపై అనుమానాలు నివృత్తి చేస్తామని తెలిపారు. గ్రామాలలో సర్వే చేసిన సిబ్బంది వ్యాధి ఉన్న వారిని పిహెచ్‌సికి పంపాలన్నారు. తద్వారా కుష్ఠ వ్యాధి లేని సమాజాన్ని తయారు చేద్దామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశాలు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దగ్గుబాడు పంచాయతీ వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న దగ్గుబాడు ఆయుర్వేద వైద్యులు శ్రీనివాస్, నిజాంపట్నం మండలంలో..

నిజాంపట్నం: కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కూచినపూడి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఉషారాణి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి వస్తే భయపడాల్సిన అవసరం లేదని, చికిత్స తీసుకుంటే తగ్గుతుందని చెప్పారు. కుష్టు వ్యాధిగ్రస్తులపై చూపించే వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ వర్ధంతి రోజున కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులను అంటరానివారుగా చూడరాదని ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, వైద్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

పంగులూరు: కుష్టు వ్యాధి వచ్చిన వారి పట్ల వివక్ష చూపరాదని, వారిని అవహేళన చేయకుండా ప్రేమతో ఆదరించాలని, పంగులూరు ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని, ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు, ప్రతి సంవత్సరం కుష్టు వ్యాధి గురించి అవగాహన, ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని మల్లికార్జునరావు అన్నారు. ఇందులో భాగంగా సోమవారం కోటపాడు గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ, కుష్టు వ్యాధి వచ్చిన ప్రజలను గౌరవించాలని, చేయి చేయి కలిపి పనిచేసి కుష్టు వ్యాధి లేని సమాజాన్ని నిర్మించాలని అన్నారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చేతులు పాదాలలో నొప్పి లేని పుండ్లు ఉన్న వారు, పూర్తిగా మూసుకోలేని కళ్లు ఉన్న వారు, కాళ్లు చేతుల్లో కండరాల బలహీనత మొదలగు లక్షణాలు ఉన్నవారిని గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు గుర్తించాలని కోరారు. కుష్టు వ్యాధికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉచితంగా ఇస్తామని డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మదర్శ, ఏఎన్ఎం మంగమ్మ, సిహెచ్ఓ శ్రావణ సంధ్య, సింగారెడ్డి, సతీష్ కుమార్, 104 సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అండర్ పాస్ వంతెన నిర్మించాలని గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో ఉన్న అద్దంకి, నార్కెట్‌పల్లి నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే రహదారిపై, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో అండర్ పాస్ వంతెన నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు 400 మందికి పైగా ఉన్నారు. ప్రతిరోజూ గ్రామంలోని నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే రహదారిని దాటుతూ, పాఠశాలకు విద్యార్థులు వెళుతున్నారు. హైవే రహదారి కావడంతో నిత్యం రహదారి వాహనాలతో రద్దీగా ఉంటుంది. విద్యార్థులు రహదారి దాటే క్రమంలో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి దాటి రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లాల్సిఉంది. ఈ రహదారి దాటే సమయంలో గతంలో పలు ప్రమాదాలు జరిగి కొందరు మృత్యువాత పడ్డారు. అండర్ పాస్ వంతెన నిర్మించాలని కోరుతూ స్థానికులు ఏల్చూరులోని టోల్ ప్లాజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా పోతున్న నీళ్లు

ప్రజాశక్తి-వేటపాలెం

రెండు సంవత్సరాలుగా జగనన్న కాలనీల్లో నీరు వృథాగా పోతోంది. పట్టించుకోవాల్సిన అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకొంటున్నారు. వేటపాలెం మండలంలో మొత్తం ఆరు జగనన్న కాలనీల లేఅవుట్‌లు వేశారు. ఆరు లేఅవుట్‌ల్లో 808 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి గృహ నిర్మాణాలు మొదలుపెట్టారు. చల్లారెడ్డిపాలెం కొణిజేటి నగర్‌లో 283, చేనేతపురి కాలనీలో 254, జెవికె కాలనీలో 153, మదర్ థెరిస్సా కాలనీలో 68, కొత్తపేట అబ్దుల్ కలామ్ కాలనీలో 36, వేటపాలెం అంబేద్కర్ నగర్‌లో 10 గృహాలు నిర్మాణాలు ప్రారంభించారు. ఈ కాలనీల్లో గృహాలు నిర్మించేందుకు నీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, గృహ నిర్మాణ శాఖల అధికారులు సమన్వయంతో తాత్కాలికంగా వాటర్ పైప్‌లైన్‌ను ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు వేశారు. ఒక్కొక్క కాలనీకి కనీసం వందకు తగ్గకుండా ట్యాపులు లాగారు. ఈ తంతు నడిచి దాదాపు రెండు సంవత్సరాలు దాటింది. అప్పటి నుంచి ఆరు కాలనీల్లో బోరు వేశారంటే అన్ని కుళాయిల గుండా నీరు వృథాగా పోతోంది. ఈ చిన్న సమస్యను పరిష్కరించకపోవడంతో రెండు సంవత్సారాలుగా నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు కలుగజేసుకొని జగనన్న కాలనీలో నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

వృథా అవుతున్న నీరు

నీటి వృథాగా అరికడతాం

ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి ఎఇ పి రామ్‌కుమార్

నీరు వృథాగా పోతున్న విషయం గురించి ఎవరూ నా దృష్టికి తీసుకురాలేదు. తక్షణమే నీటి వృథాను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటాను.

వేలం నోటీసు
(ఆర్డర్ 21.రుల్ 64,66)
మహారాజశ్రీ ఒంగోలు 1 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
EP NO : 303/2019
in
OS NO : 190/2015
చంద్ర గురుమూర్తి ....DHR
వర్సెస్
కటారి వేంకటేశ్వర్లు @ వెంకటేశ్వరరావు .....JDR
To
కటారి వేంకటేశ్వర్లు @ వెంకటేశ్వరరావు
SI (ID No: 289) తండ్రి కోటయ్య
Employee in Police Department నివాసం
మండవ వారిపాలెం గ్రామం, ఒంగోలు మండలం
ప్రకాశం జిల్లా
పై నెంబర్‌న డి.హెచ్.ఆర్ మీ తాలూకు ఆస్తులను వేలం ద్వారా అమ్ముటకు గాను నోటీస్ నిమిత్తం తేది 28-02-2023 నకు వాయిదా వేశారు కనుక వాయిదా రోజు న ఉదయం 10:30 కి పై కోర్టులో స్వయంగా గాని అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలసినది లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఇట్లు
బి.లక్ష్మీనారాయణరావు
డిహెచ్‌ఆర్ తరపున్యాయవాది
ఒంగోలు

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం : 32/2022
ఇన్
ఓ.ఎస్.నెం: 64/2020
విక్రమ్ వెంకటేశ్వర్లు ....డి.హెచ్.ఆర్.
వర్సెస్
1.మేళం రమాదేవి మరియు వగైరాలు ...జె.డి.అర్స్
టు
జె.డి.ఆర్1) మేళం రమాదేవి భర్త లేట్ గురవయ్య,
జె.డి.ఆర్2) రప్పతోటి వరలక్ష్మి అలియాస్ చిన్నమ్మాయి భర్త నరసింహం
జె.డి.ఆర్ 3) రప్ప తోటి రాజి భర్త శివ,
జె.డి.ఆర్ 4) మేళం మామిని తండ్రి లేటు గురవయ్య, అందరూ చిలంకూరు గ్రామం, మద్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా.
వేలం నోటీసు అండర్ ఆర్డర్ 21 రూల్ 66 సిపిసి
పై నెంబరు డి హెచ్ ఆర్ చనిపోయిన మేళం గురవయ్య తాలూకు ఇ. పి. షెడ్యూలు ఆస్తిని వేలం కోరి అమలు దరఖాస్తు ను దాఖలు చేసి నందున మీకు వేలం నోటీసులు జారీ నిమిత్తం తేదీ: 20-02-2023 నకు వాయిదా కలదు. సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు పై వారి కోర్టులో హాజరై నీ ఆక్షేపణలను తెలియపరచవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుసుకొన వలెను.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేదీ : 20-02-2023
ఇట్లు
తాడికొండ రామమోహన్‌రావు,
డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేట్,
పొదిలి,
సెల్ :9885636729.

వేలం ప్రకటన
మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 9/2016
in
O.S 67/2012
Between:
కరణం అన్నపూర్ణమ్మ ...DHR
Vs
ఇనగంటి రహంతున్నీసాబేగం మరొకరు ..... JDRS
పై నంబరు EP లోని DHR తనకు JDRs నుండి రావాల్సిన EP బాకీని రాబట్టు కొనుటకు ఈ క్రింద ఉదహరించిన షెడ్యూల్ ఆస్తిని వేలం వేయమని శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. కనుక ఆసక్తి గల వారు ఎవరైననూ పై కోర్టులో ది. 09-02-2023 ఉదయం 10.30 గంట లకు జరుగు వేలం పాటలో పాల్గొనవచ్చును. కోర్టు షరతుల ప్రకారంగా వేలం జరుపబడును.
షెడ్యూల్ :
ప్రకాశం జిల్లా, (ప్రస్తుత బాపట్ల జిల్లా) ఇంకొల్లు S.R.O. ఇంకొల్లు గ్రామ పంచాయతీలోని 4వ వార్డులో గల D.No : 398/1, డోర్ నంబరు: 218(2). 194 చదరపు గజంలో గల డాబా ఇల్లు. స్థలం ఈ క్రింది హద్దులతో :
తూర్పు : షేక్ మస్తాన్ వగైరాల ఖాళీ స్థలం,
దక్షిణం : పఠాన్ సుభాని ఇల్లు,
పడమర : బజారు,
ఉత్తరం : చిలంకూరి అనసూర్యమ్మ ఇంటి గోడహద్దు.
DHR విలువ : Rs. 5,00,000/-
అమీనా విలువ : Rs. 8,00,000/-
వేలంతేది : 09-02-2023
ఫర్దర్ హియరింగ్ : 16-02-2023
పర్చూరు: 30-01-2023 సం/-
ఇట్లు,
యార్లగడ్డ వెంకటేశ్వరరావు,
అడ్వకేట్, పర్చూరు,
సెల్:9985534998

ప్రజాశక్తి 3
మంగళవారం 31 జనవరి 2023

ఆ అధికారులపై చర్యలు తీసుకోండి

స్పందనలో కలెక్టర్, ఎస్పీలకు నాయుడు నాగార్జున రెడ్డి ఫిర్యాదు

ప్రజశక్తి-వేటపాలెం

నాయుడు నాగార్జునరెడ్డిని హత్య చేయడానికి 2015 నుంచి పలుమార్లు ఆమంచి కృష్ణమోహన్, అతని రక్తసంబంధీకులు కుట్రలు పన్నారని, 2019లో చిన్నగంజాం వద్ద జరిగిన హత్యా ప్రయత్నం ఘటనలో పోలీస్ అధికారులకు భాగస్వామ్యం ఉందని ఎన్ నాగార్జునరెడ్డి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదులు చేశారు. పూర్వపు ఇంకొల్లు సీఐ రాజుపాలెం రాంబాబు, చీరాల 1వ పట్టణ సీఐ ఎన్ నాగమల్లేశ్వరరావు, వేటపాలెం ఎస్ఐ అజయ్ బాబు, అప్పటి అద్దంకి సీఐ టి అశోక్ వర్ధన్‌రెడ్డి ఆమంచి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు పనిచేసి ఈ హత్యాయత్నం కేసును తప్పుదారి పట్టించి, ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు సమర్పించి ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేసి కేసును పూర్తిగా నీరుగార్చారని నాగార్జున రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ హత్యాయత్నం కేసులో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమంచి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు వారి అనుచరులను ఆరుగురిని సరెండర్ చేసి కారంచేడు పోలీస్ స్టేషన్‌లో లాయర్ తులసి ద్వారా రాచమర్యాదలు చేశారన్నారు. నిందితుల అరెస్టు అంటూ డ్రామాలాడి కేసును నీరుగార్చారని అన్నారు. పోలీసు అధికారులతో పాటు అప్పటి జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ భారీ అవినీతికి పాల్పడి కేసు నుంచి ఆమంచి కృష్ణమోహన్, 12 మంది వారి రక్త సంబంధీకులను ఉద్దేశపూర్వకంగా తొలగించారన్నారు. ఈ విషయమై సమగ్రంగా దర్యాప్తు చేసి సంబంధిత పోలీసు అధికారులు అందరినీ కఠినంగా శిక్షించాలని, ఈ హత్యాయత్నం కేసును పునర్విచారణ జరిపి, ప్రధాన కుట్రదారుడు ఆమంచి కృష్ణమోహన్, ఆమంచి శ్రీనివాసరావు అలియాస్ స్వాములు, మేనల్లుళ్లు బావమరుదులు అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో నాయుడు నాగార్జున రెడ్డి కోరారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని రాయవరం రైల్వే సేష్టన్ సమీపంలోని రైలు పట్టాలపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మార్కాపురం రైల్వేసేష్టన్ సమీపంలోని స్టోన్ నెంబరు 123 కెఎం వద్ద ఆదివారం అర్ధరాత్రి ఒక యువకుడు రైలు పట్టాల పక్కన కూర్చొని ఉన్నాడు. సరిగ్గా రైలు వచ్చే సమయానికి ఆ యువకుడు ఒక్కసారిగా రైలు బండికు ఎదురుగా వచ్చి పట్టాలపై కూర్చున్నాడు. వెంటనే అప్రమత్తమైన రైలు డ్రైవర్ హారన్ కొడుతూ రైలుకు బ్రేక్ కొట్టిన రైలు ఆగకపోవడంతో ఆ యుకుకుడిని ఢీకొట్టింది. దీంతో జరిగిన ఘటన గురించి రైలు బండి డ్రైవర్ సెట్ ద్వారా మార్కాపురం రైల్వే సేష్టన్ మాస్టర్‌కు తెలుపగా వెంటనే స్టేషన్ మాస్టర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో హేడ్ కానిస్టేబుల్ ఐ హరికృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు మార్కాపురం పట్టణ పరిధిలోని 10వ వార్డు చెందిన ఆకుల శివ(17)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందిచారు. మృతుడు శివ మార్కాపురంలోని కూరగాయల మార్కెట్‌లో ఉన్న కమీషన్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శివ తండ్రి చిన్నతనంలోనే ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లి అనారోగ్యంతో బాధపడుతూ కాలం వెళ్లదీస్తోంది. మృతుడు శివ ఆదివారం సాయంత్రం వరకు ఇంటి వద్ద ఉన్నాడని, అందరితో చాలా కలుపుగోలుతనంగా ఉంటాడని చెబుతూ సహచర మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇంత చిన్న వయసు యువకుడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై రైల్వే పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పట్టాలపై పడి ఉన్న శివ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో ఆదివారం నాడు గల్లంతైన విద్యార్థి అబ్దుల్ హమీద్ సిద్ధి(15) మృతదేహం సోమవారం నాడు పాకల పంచాయతీలోని చెల్లమ్మ పట్టపాలెం వద్ద సముద్రం నుంచి కొట్టుకొచ్చింది. ఈ విషయంపై చెల్లెమ్మ పట్టపాలెం గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు సోమరాజు పల్లి పంచాయతీలోని పక్కిరుపాలెం శింగరాయకొండకు చెందిన ముస్లింలు అందరూ పాకాల సముద్ర తీరానికి చేరుకున్నారు. చెల్లమ్మ పట్టపాలెం వద్ద విద్యార్థి హామీద్ సిద్ధి సముద్రంలో కొట్టుకొచ్చిన మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. ఓ పక్క ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూతురు అమలను చూసుకుంటూ ఇక్కడకు వచ్చి కుమారుడు మృతదేహాన్ని చూసి వినిపించారు. గీతం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి మరణించడంతో పాఠశాలకు సెలవు దినం ప్రకటించారు. ఆ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం అక్కడికి వెళ్లి మహమ్మద్ సిద్ధి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. శింగరాయకొండ పోలీసులు చెలమ్మ పట్టపాలెం చేరుకొని శవ పంచనామా పూర్తి చేసి పోస్టుమార్టం కోసం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శ్మశాన స్థలాన్ని కేటాయించాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

వెల్లంపల్లి ఎస్‌సి కాలనీ వారికి శ్మశానానికి స్థలాన్ని మంజూరు చేయాలనీ, కాలనీవాసులు సోమవారం ప్రజా విజ్ఞప్తులలో అందచేశారు. అర్జీలో వెల్లంపల్లి ఎస్‌సి కాలనీలో సుమారు 400 కుటుంబాలు నివాసముంటున్నారన్నారు. శ్మశానికి గతంలో స్థలం ఉందని, దీనిలో కొంత గుండ్లకమ్మలో వరదలకు కొట్టుకు పోయిందని, మిగిలినది కొందరు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని తెలిపారు. దీంతో శ్మశానం లేక కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా శ్మశానం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీ శౌరి, కే రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జంతువుల పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

జంతువుల పట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఏ రమేష్ బాబు పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చిలకపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జంతు సంరక్షణ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ జంతువుల ప్రేమ కరుణ దయ కలిగి ఉండాలని వాటి పట్ల మానవ సంబంధాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో జంతువుల పాత్ర చాలా ముఖ్యమైనదని ఆయన తెలిపారు. వ్యవసాయం ఆహార ఉత్పత్తులు గ్రామీణ ఉపాధి తదితర రంగాల్లో జంతువుల భాగస్వామ్యం చాలా కీలకమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు వివి రమణయ్య, మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని నిడమానూరు గ్రామానికి చెందిన వాకా వీరారెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.10 లక్షల చెక్కును సోమవారం స్థానిక శాసనసభ్యులు టిజెఆర్ సుధాకర్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా సహాయనిధిని మంజూరు చేయించిన ఎంఎల్‌ఏకు అభినంద నలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు, పులిచర్ల పరంధామిరెడ్డి, కుమ్మారి సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్చూరులో రోటరీ పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

వృత్తి సేవా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వివిధ వృత్తుల్లో ప్రతిభ కనబర్చిన వారికి వృత్తి సేవా పురస్కారాలు అందజేశారు. హోమియో వైద్యులు ఉషా, బ్యాంకు ఉద్యోగి బొడ్డు ఆదిలక్ష్మి, కోర్టు ఉద్యోగి పుష్పలత, పశువైద్య శాఖలో వి కుసుమ కుమారి, దగ్గుబాటి రాజ్యలక్ష్మిలతో పాటు పలువురికి రోటరీ పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ ఒకేషనల్ డైరెక్టర్ రావి సత్యనారాయణ మాట్లాడుతూ పురస్కార గ్రహీతలందరూ పెద్దమనసు చేసుకొని సమాజానికి మరిన్ని సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా అన్నె రత్నప్రభాకర్, లంకా రఘురామిరెడ్డి, రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కెవెస్ఆర్‌కె ప్రసాదు, కోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. వికలాంగులు

- మానసిక వికలాంగులపై వరుస దురాగతాలు
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో హేయమైన ఘటనలు
- బాధ్యతాయుత ఉన్నతాధికారుల్లో ఘోర నిర్లక్ష్యం
- నిరసన వ్యక్తం చేస్తున్న వికలాంగుల సంఘాలు

ప్రజాశక్తి-వేటపాలెం

నిత్యం ప్రజల కోసం పాటుపడే బాధ్యత కలిగిన ఉన్నతాధికారుల ఘోర నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ఫలితంగా ఉమ్మడి ప్రకాశంలో మానసిక వికలాంగురాళ్లపై దురాగతాలు ఆగడం లేదు. రోజుల వ్యవధిలో నాలుగు వేరువేరు ప్రాంతాల్లో నలుగురు మానసిక వికలాంగురాళ్లపై అత్యంత హేయమైన ఘటనలు వెలుగు చూశాయి. నోరు లేని వారిపై జరుగుతున్న అత్యాచారాలపై క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు తగిన చర్యలు చేపట్టడం లేదని దివ్యాంగ సంఘాలు విమర్శిస్తున్నాయి. నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా ఈ విషయాలపై విమర్శిస్తు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. అయినా అధికారుల్లో కించిత్ చలనం లేదని ఆయన వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే... కొండపి మండలం ముప్పవరం గ్రామంలో 9వ తరగతి చదువుతున్న మతిస్థిమితం లేని 14 ఏళ్ల బాలిక మీద నలుగురు వ్యక్తులు అత్యాచారం చేశారు. అదే గ్రామానికి చెందిన ఈ నలుగురు బాలిక స్కూల్‌కు వెళ్లే దారిలో బెదిరించి నాలుగు నెలలుగా అత్యాచారానికి పాల్పడుతున్నారు. బాలిక అనారోగ్యంతో బాధపడుతుండగా హాస్పటల్ తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తే ఆమె గర్భవతి అని తేలింది. ఇక్కడ ఆ బాధితురాలి తల్లి కూడా మానసిక వికలాంగు రాలే. నిందితులు మాదాల శ్రీను, దొడ్డవ నరసింహ దీవాన్, చల్లా వెంకటరావు, పొట్టిపిల్లగాని యానాది లపై గ్రామస్థుల సహకారంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మెడికల్ రిపోర్ట్ రాలేదని జవాబు ఇచ్చి పోలీసులు మిన్నకుండిపోయారు. ఇంతటి దురాగాతానికి పాల్పడ్డ నలుగురు యువకులు మాత్రం దర్జాగా ఊళ్లో తిరుగుతున్నారు.

నాగులుప్పలపాడు మండలం, మాచవరం గ్రామంలో మానసిక వికలాంగురాలిపై హెచ్ఐవి రోగి పీకా వెంకట సుబ్బయ్య దుర్మార్గానికి ఒడిగట్టారు. ఇతడు గతంలో కూడా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడి కొందరి మరణాలకు కారకుడయ్యాడు. ఇలాంటి వ్యక్తికి నాగులుప్పలపాడు ఎస్ఐ హరిబాబు స్టేషన్ బెయిల్ ఇవ్వడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితురాలి తండ్రి ఈ విషయమై ప్రశ్నించినందుకు ఏమైనా ఉంటే కోర్టులో చూసుకో స్టేషన్‌కు రావద్దు అంటూ హూకుం జారీ చేశాడని వాపోయాడు.

పర్చూరులో మతిస్థిమితం లేని యువతిపై అదే గ్రామానికి చెందిన మిండ్యాల సుబ్రహ్మణ్యం అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు తినుబండారాలు కొనుక్కోవటానికి వెళ్లిన సమయంలో నిందితుడు బలవంతంగా సమీపంలోని ఇంట్లోకి తీసుకొనివెళ్లి బలాత్కారం చేశాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఇంకొల్లు సిఐ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు.

తాజాగా ఈ నెల 28వ తేదీ టంగుటూరు మండలం ఆలకూరపాడు శివారు గ్రామంలోని డిష్ వ్యాపారం చేసుకొనే లేళ్లపల్లి కళ్యాణ్ అనే వ్యక్తి ఇంటిలో ఒంటరిగా ఉంటున్న బాధితురాలుపై కన్నేసి రోజూ ఇంటికే వెళ్లి అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. ఈ కేసులో తల్లి ఫిర్యాదు మేరకు టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఖాదర్‌బాషా పోక్సో కేసు నమోదు చేసి బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఈ రకంగా నెలలో వరుసగా నాలుగు ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటితో పాటు బాపట్ల పురపాలక శాఖలో విధులు నిర్వహిస్తున్న వికలాంగ ఉద్యోగి నల్లమోతు నరసింహారావు ఈనెల జనవరి 4న ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో నరసింహారావును సంబంధిత ఉన్నతాధికారి సస్పెండ్ చేయడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడని వార్తలు వచ్చాయి. అసలు ఫోర్జరీ చేసింది ఎవరు? ఉన్నతాధికారి ఎందుకు పోలీసు కేసు పెట్టలేదు. ఫోర్జరీ చేసిన పత్రాలు ఎక్కడ ఉన్నాయి? అనే ప్రశ్నలకు ఉన్నతాధికారి వద్ద జవాబు దొరకడం లేదు. ఇలాంటి సంఘటనల వలన సమాజంలో అభద్రతాభావం ఏర్పడి వాస్తవాలు మరుగున పడిపోతున్నాయని మేధావులు వాపోతున్నారు. వికలాంగుల కోసం నిర్వహిస్తున్న సంక్షేమ శాఖ జిల్లా ఏడిలు, డైరెక్టర్లు ఈ ఘటనలపై ఇంతవరకు స్పందించలేదని వికలాంగుల సంఘాల నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వికలాంగుల పట్ల జరుగుతున్న దుర్మార్గాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాడీ బిల్డర్ ఎస్తేరురాణితో ఎంపీ నందిగం సురేష్ తదితరులు

బాడీబిల్డర్ ఎస్తేరు రాణికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం వేమూరు గ్రామానికి చెందిన ఏపి స్టేట్ బాడీబిల్డర్ రావూరి ఎస్తేరురాణికి సోమవారం బాపట్ల ఎంపీ నందిగం సురేష్ తన సహచరులతో కలసి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ రంగంలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. అలాగే ఎస్తేరురాణి పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వపరంగా మరింత సహాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అలాగే ఏడాది పాటు డైట్ అండ్ జిమ్‌కు అవసరమైన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్కిటెక్ట్ బాలసాని కిరణ్, ఎక్స్‌పో ఎడ్యుకేషన్ చైర్మన్ అరవింద అరసవెల్లి, కొర్రెపాటి సురేష్ తదితరులు ఉన్నారు.

సుకన్య పొందిన సర్టిఫికెట్‌తో కళాశాల యాజమాన్యం

సుకన్యకు సర్టిఫికెట్ ఆఫ్ ఎప్రిసియేషన్ ప్రదానం

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ డివిఎన్ సుకన్యకు ఎన్‌పిటిఇఎల్ వారిచే సర్టిఫికెట్ ఆఫ్ ఎప్రిసియేషన్ పొందినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్టిఫికెట్ ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులు రిజిస్టరై ఆధునిక టెక్నాలజీకి సంబంధించిన కోర్సులను అభ్యసించవచ్చని తెలిపారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న కిమ్స్ వైద్యులు

పర్చూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఇంకొల్లు రోడ్డులోని రోటరీ భవన్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు వైద్య శిబిరాన్ని రోటరీ సహకారంతో ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి, బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించారు. గుండె, కిడ్నీ, విషజ్వరాలు లాంటి వ్యాధులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందజేశారు. 250 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగనిర్ధారణ జరిగిన రోగులకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఇఎస్ఐ, ఇహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని కిమ్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫి వివరించారు. వైద్యశిబిరంలో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ రామాంజనేయులు, స్వర్ణ సునీల్, స్వాతి, రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన పింఛన్లు ఇక రానట్లేనా?

ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా చేపట్టిన పింఛనుదారుల వడపోత కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లాలో కొన్నేళ్ళుగా పింఛన్లు అందుకుంటున్న 1,463 మంది జనవరి నెలలో తమ పింఛన్లను కోల్పోయారు. డిసెంబరు నెలలో జిల్లాలో పింఛన్లు అందుకుంటున్న 4,397 మందికి ప్రభుత్వం పలు కారణాలు చూపుతూ నోటీసులు ఇచ్చారు. పింఛనుదారు కుటుంబం ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని, పొలం ఎక్కువ ఉందని, ఇంటి నివాసం నిర్దేశించిన దాని కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉందని, విద్యుత్ బిల్లు 300 యూనిట్లు మించి వచ్చిందని, నాలుగు చక్రాల వాహనం ఉందన్న కారణాలు చూపుతూ ప్రభుత్వం ఇస్తున్న పింఛనుకు మీరు అర్హులు కారని నోటీసులు ఇచ్చారు. జిల్లాలోని చీరాల, అద్దంకి, రేపల్లె, బాపట్ల పురపాలక సంఘాల పరిధిలో 1,642 మంది ఇలా నోటీసులు అందుకున్నారు. పింఛను పొందేందుకు అర్హులుగా తగిన ఆధారాలు చూపాలని రెండు వారాల గడువు ఇచ్చారు. దీంతో పెద్దఎత్తున పింఛన్లను రద్దు చేస్తున్నారని విస్తృత ప్రచారం జరిగింది. గడప గడపకూ కార్యక్రమంలో ఉన్న అధికార పార్టీ నేతలను వార్డుల్లోని పింఛనుదారులు ఈ విషయమై నిలదీశారు. పింఛన్ల రద్దు వ్యవహారం తమకు ఇబ్బందికరంగా మారుతుందని గ్రహించిన నేతలు వీలున్నంత వరకు పింఛన్లు రద్దు కాకుండా చర్యలు తీసుకున్నారు. ఇందులో ఎక్కువ విస్తీర్ణంలో నివాసాలకు సంబంధించి, ఆదాయపు పన్నుకు సంబంధించి లబ్ధిదారుల చేత రాత పూర్వక పత్రాలు తీసుకుని వారి పింఛన్లు ఉంచగలిగారు. ఇలా చాలా వరకు పింఛన్లు ఉండేలా ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా ఉండేలా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ అద్దంకి పురపాలక సంఘ పరిధిలో 205, చీరాల పట్టణంలో 183, రేపల్లె పురపాలక సంఘ పరిధిలో 232, బాపట్లలో 62 పింఛన్లు నిలిచిపోయాయి. ఇలా జిల్లాలోని అన్ని మండలాల్లో మొత్తంగా 1,463 మందికి పింఛన్లు నిలచిపోయాయి. ఇలా ఫింఛన్లు నిలిచిపోయిన వారు తమకు తిరిగి ఇవ్వాలంటూ నేతలు, అధికారుల చుట్టూ తిరుగుతూ వచ్చారు. ఫిబ్రవరి నెలలో అయినా తమ ఫించన్లు వస్తాయన్న ఆశతో ఉన్నారు. అయితే వీరందరి పింఛన్లు రద్దు అయినట్లేనని, వీరు తిరిగి పింఛన్ పొందాలంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలకొకసారి మాత్రమే కొత్తగా ఫింఛన్లు ఇస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఆ కారణంగా ఫింఛన్లు కోల్పోయిన వారు తిరిగి వాటిని పొందాలంటే ఆరు నెలల కాలం వేచి చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. అలా కాకుండా ఫింఛన్లు కోల్పోయి అందులో అర్హులుగా ఉన్నవారికి ఫిబ్రవరి నెలలో అయినా పింఛన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

పింఛనుదారులు (ఫైల్)

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య

పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-అద్దంకి

ప్రభుత్వ పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. సోమవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా అద్దంకి రెండో వార్డులోని గరటయ్య కాలనీలో ఆయన ఇల్లిల్లూ తిరిగారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అంతర్గత రహదారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గతంలో తనకు పెన్షన్ వచ్చేదని, ఇప్పుడు పెన్షన్ తొలగించారని ఓ మహిళ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాన్ని తెచ్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని, తిరిగి మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులు వెంటనే తమ ఇళ్లను పూర్తి చేసుకోవాలని, ఇంటి స్థలం విలువ ఆరు లక్షలు అని, ఇంటి కోసం ప్రభుత్వమే లక్ష్యా ఎనభై వేలు ఇస్తుందని తద్వారా పది లక్షల రూపాయల విలువైన ఆస్తి సమకూరుతుందని వెంటనే ప్రతి లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్‌లు అనంతలక్ష్మి వీరయ్య, దేసు పద్మేష్, కౌన్సిలర్స్ మేడగం రమణ, బాలు, కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్, ఉడత సురేష్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో జాతిపిత మహాత్మా గాంధీ వర్థంతి కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవిగుంట ప్రభాకర్‌రావు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పథకాలు అమలు చేయాలి

రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-చీరాల

రెవెన్యూ శాఖలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ఉద్యోగులకు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జీవిగుంట ప్రభాకర రావు అన్నారు. ఏపి రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సేవా సంఘ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు జీవిగుంట ప్రభాకర రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెవెన్యూ ఎస్సి, ఎస్టీ ఉద్యోగులందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అన్నీ అర్హులైన వారందరికీ తప్పనిసరిగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గాన్ని బలోపేతం చేసేందుకు అదనంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణా జిల్లా నుంచి సిహెచ్‌ని, రాష్ట్ర అసోషియేట్ ప్రెసిడెంట్‌గా అనంతపురం జిల్లా నుంచి జి మధుసూదనరావును, మీడియా ప్రతినిధులుగా గుంటూరు జిల్లా నుంచి జి దేవరాజ్, రాష్ట్ర ఇసి మెంబర్లుగా సిహెచ్ అజయ్‌లను ఎన్నుకున్నారు.

పోరాడే శక్తులను గెలిపించండి

యు దేవపాలన, విశ్రాంత ఆర్‌జెడి

ప్రజాశక్తి-అద్దంకి

మార్చి నెలలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డికి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రిటైర్డ్ ఆర్జెడి యు దేవపాలన చారిత్రక పరిశోధకులు జ్యోతి చంద్రమౌళి అన్నారు. సోమవారం అద్దంకి పట్టణంలోనే ఘంటసాల సెంటర్ వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డికి మద్దతు తెలుపుతున్నామని అన్నారు. జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ నిజాయితీతో ఉపాధ్యాయుడిగా పని చేశారని నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలపైన అనేక పోరాటాలు చేశారన్నారు. గతంలో వెంకటేశ్వరరెడ్డి కలిసి పనిచేసిన జ్ఞాపకాలను గుర్తు చేశారు. పోరాడే శక్తులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో పిడిఎఫ్ ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్, ఎమ్మెల్సీలుగా ప్రస్తుతం ఐదుగురు పనిచేస్తున్నారని, వీరంతా తమ పదవీ కాలంలో కార్మిక కర్షక ఉద్యోగ ఉపాధ్యాయుల పోరాటాలకు తమ మద్దతు తెలుపుతూ అండగా ఉన్నారని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనవ్వకుండా నిజాయితీగా ప్రజాసేవ చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారి గెలుపు ప్రజలకు మేలు చేస్తుందని, ఈ మధ్యకాలంలో జరిగిన అనేక సమరశీల పోరాటాల్లో ప్రత్యక్షంగా వారు పాల్గొన్న తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పి తిరుపతిరెడ్డి, జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరపత్ర పంపిణీ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ కమిషనర్ టి రవికుమార్, మరియు ఆఫీస్ సిబ్బందిని కలిసి కరపత్రం పంపిణీ చేశారు.

ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'వెలిగొండ'ను త్వరగా పూర్తి చేయాలి

- సిఎం జగన్ ఇచ్చిన మాటపై నిలబడాలి
- వచ్చే సెప్టెంబరు నాటికి జలాలు విడుదల చేయాలి
- నిర్వాసితులను తక్షణమే ఆదుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-మార్కాపురం

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో నేటికీ జాప్యం జరుగుతూనే ఉందని, రెండో సొరంగం పనులు నిలిచిపోయాయని అఖిలపక్ష నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన స్థానిక ఎన్‌జిఒ హోంలో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడారు. గాలి వెంకటరామిరెడ్డితో పాటు టిడిపి నుంచి మాజీ జడ్‌పిటిసి కందుల రామిరెడ్డి, షేక్ మౌలాలి, కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ సైదా, మెడబలిమి వెంకటేశ్వర్లు, సిపిఐ నుంచి అందె నాసరయ్య,

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

సిపిఎం నుంచి డి.సోమయ్య, డికెఎం రఫి, పి.రూబెన్, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి వి.సుదర్శన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు ఎన్నికల హామీగా మిగిలిపోతోందన్నారు. ఈ ప్రాంతంలో తాగునీటికి సైతం తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. సాగునీరు లేక వర్షాధారంపై పంటలు పండక రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని రైతన్నల ఆత్మహత్యలు పశ్చిమ ప్రకాశంలో జరుగుతున్నాయని వాపోయారు. ఇంతటి దుర్భిక్ష ప్రాంతంలో వెలిగొండను పాలకులు మర్చిపోవడం సరికాదన్నారు. ప్రస్తుతం రెండో సొరంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ నీటిని వచ్చే సెప్టెంబరు నాటికి విడుదల చేస్తామని చెప్పారన్నారు. ఇచ్చిన మాటకు సిఎం జగన్ కట్టుబడి ఉండాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నత్తనడకకు నిధుల కొరతే కారణమన్నారు. వచ్చే బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టు కోసం రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. వెలిగొండపై నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు నాయకుడు గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఫుడ్‌కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

వ్యాపార రంగంలో ముందుకెళ్లాలి

కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట

ప్రజాశక్తి-శింగరాయకొండ

వ్యాపార రంగంలో ఫుడ్ కోర్ట్ ముందుకు వెళ్లాలని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. శింగరాయకొండ మండలం, మూలగుంటపాడు గ్రామపంచాయతీలో సోమవారం నాడు వన్ స్టాప్ ఫ్యామిలీ ఫుడ్ కోర్టు మానుగుంట ప్రారంభించారు. హాలును కొండపి వైసిపి ఇంచార్జ వరికూటి అశోక్‌బాబు ప్రారంభించారు. పైన ఉన్న ఓపెన్ హాలును ఎంపీపీ కట్ట శోభారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో దొడ్డ కరుణాకర్‌రెడ్డి, యువ నాయకులు దొడ్డ మహీధర్‌రెడ్డి, లింగారెడ్డి, సతీష్‌రెడ్డి, షేక్ గౌస్‌బాషా, షేక్ వలీ, షేక్ పటేల్, షేక్ సలీం భాషా, రాజు, వెంకటేశ్వరరెడ్డి, జెట్టి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి దొడ్డ మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి పూలమాల వేసి..నివాళులర్పించారు.

బాధ్యతలు చేపట్టిన ఏఎంసి ఛైర్మన్

ప్రజాశక్తి-శింగరాయకొండ

కొండపి వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా గోగినేని శారద సోమవారం నాడు శింగరాయకొండ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన ఛైర్మన్‌కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి నరసింహారావు ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గోగినేని వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శారద

పాఠశాలకు టీవీ బహూకరణ

ప్రజాశక్తి-దరిశి

కస్తూరిబాగాంధీ పాఠశాలకు స్మార్ట్ టీవీని దరిశి డిప్యూటీ తహశీల్దార్ ఎ.రవిశంకర్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, వాణి, మేర్సినా, హేమలత, గీత పాల్గొన్నారు.

టీవీని బహుకరిస్తున్న దృశ్యం

గాంధీ మార్గం అనుసరనీయం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అందరికీ అనుసరనీయమని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక తహశీల్దార్ కార్యాలయం, బొడ్డుచావిడి వద్దగల గాంధీ విగ్రహాలకు ఆయనతో పాటు టిడిపి శ్రేణులు పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ గాంధీ కలలకు తగ్గట్లు రాష్ట్రంలో పాలన లేదని విమర్శించారు. దుష్టపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ ఫిరోజ్, చింతలపూడి తిరుపాలు, ముచ్చుమారి చెంచిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర

పొలం బడిలో పాల్గొన్న ఎడిఎ వి.రామకోటేశ్వరి

పురుగుమందులు తక్కువ మోతాదులో వాడాలి: ఎడిఎ

ప్రజాశక్తి-దరిశి

రైతులు ఎరువులు, పురుగు మందులు తక్కువ మోతాదులో వాడాలని ఎడిఎ కమీషన్‌రేట్ ఇన్‌స్పెక్షన్ అధికారి వి.రామకోటేశ్వరి అన్నారు. మండలంలోని బొట్లపాలెం గ్రామంలో పొలంబడి క్లష్టరు కార్యక్రమం మండల వ్యవసాయాధికారి బాలక్రిష్ణనాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పంటలకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎరువులు, పురుగుమందులు అవసరమైన మేరకు వాడాలన్నారు. ఈ సందర్భంగా రైతుల పరిజ్ఞానం కోసం బ్యాలెట్‌బాక్స్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. ప్రభాకర్, డిఆర్‌సి నిర్మల, వ్యవసాయాధికారులు సుచిరిత, స్వర్ణలత, బాలాజీ, విఎఎలు షేక్ బాజీ, విష్ణువర్ధన్, రైతులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి లయన్స్‌క్లబ్ వివిధ రంగాలలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. చీమకుర్తి లయన్స్‌క్లబ్, గెలాక్సీ లయన్స్‌క్లబ్, చీమకుర్తి మండల ఆర్యవైశ్య సంఘం, పట్టణాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక జవహర్ నర్సింగ్‌హోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ అధ్యక్షత వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా డాక్టర్ బి జవహర్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి, వర్ధంతిల సందర్భంగా సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. డాక్టర్ బి.జవహర్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ గాంధీ జయంతి, గాంధీ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు ఆనవాయితీగా చేస్తున్నట్లు తెలిపారు. జడ్‌పిటిసి వేమా శ్రీను మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సేవలు

సిఐటియు కార్యాలయానికి కంప్యూటర్ కొనుగోలుకు నగదును అందజేస్తున్న నాయకులు

అభినందనీయమన్నారు. మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారంవెంకారెడ్డి మాట్లాడుతూ తాను లయన్స్‌క్లబ్ సభ్యునిగా తమ వంతు సహకారం అందజేస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ చీమకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సిఐటియు కార్యాలయానికి కంప్యూటర్, ప్రింటర్ అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి..నివాళులర్పించారు.

సేవా కార్యక్రమాలు..

పాటిమీదపాలెం ప్రాథమిక పాఠశాలకు వంటసామాగ్రి అందజేశారు. సిఐటియు కార్యాలయానికి కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. ఇలపావులూరు యుపి పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నభోజనం కోసం ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వాచ్‌మెన్ గ్రాంట్ అందజేశారు. కాన్సర్ బాధిత కుటుంబానికి నెలనెలా రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. రంగస్థల నటుడు చీమకుర్తి నాగేశ్వరరావు భార్యకు పెన్షన్ అందజేశారు. పల్లామల్లి ఉచిత ఆంగ్లభోధన కోసం జివిఎస్ఆర్ పాఠశాలకు స్పెషల్ టీచర్ గ్రాంట్, పేద వ్యక్తి జీవనోపాధికి సైకిల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్ అందజేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ఇద్దరు స్పెషల్ టీచర్లకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. 50 మంది కుష్టు, ఎయిడ్స్ బాధితులకు దుప్పట్లు, దుస్తులు, కంచాలు, గ్లాసులు, భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చలువాది బదరీనారాయణ, చలువాది రమేష్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు నూనె హేమసుందరరావు, గెలాక్సీ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ముత్యాల ప్రసాద్, లయన్స్‌క్లబ్ నాయకులు మందపాటి శ్రీను, వడ్డికాసులు, ఆలపాటి నరసింహారావు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీడీ పద్మశ్రీ

'ఉపాధి' లక్ష్యాలు చేరుకోవాలి: ఏపీడీ

ప్రజాశక్తి-దరిశి

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి హామీ పనిదినాలు పెంచి.. లక్ష్యాలు చేరుకోవాలని ఏపీడీ పద్మశ్రీ అన్నారు. సోమవారం తాళ్ళూరులోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత శాఖ సిబ్బందితో ఎపిఒ మురళీ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది 3 లక్షలా 60 వేల పనిదినాలు తీసుకుంటే 2 లక్షలా 50 వేలు పనిదినాలు పూర్తి చేశారన్నారు. మండలంలో గత ఏడాది రూ.5.50 కోట్లు ఖర్చు పెట్టారని ఈ ఏడాది రూ.6 కోట్లు ఖర్చు పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇసి ప్రసాద్, శైలేజ్, సిసిలు, ఫీల్డ్‌అసిసెంట్లు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, రహదారి భద్రత మన జీవితాలకు రక్షణ అని యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన యర్రగొండపాలెంలోని 565 జాతీయ రహదారిపై వచ్చి పోయే వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని బోయలపల్లి, గోళ్ళవిడిపి గ్రామాలలో ఎన్ఎల్ఎం జాతీయస్థాయి పర్యవేక్షణ కమిటీ సోమవారం పర్యటించింది. డే ఎన్ఎల్ఎం, ఉపాధి, అంగన్‌వాడీ, పిఎంఎవైజి, పిఎంకెఎస్‌వై, పిఎంఎవైజి, హౌసింగ్ హెల్త్, వైఎస్ఆర్ క్రాంతి పథం వంటి పథకాలకు సంబంధించి కొంతమంది లబ్ధిదారులను కలిశారు. ఆయా గ్రామాలలోని పెన్షన్లు వచ్చేటువంటి ఐదు మంది లబ్ధిదారులను కలిసి వారితో పెన్షన్ల పంపిణీ గురించి చర్చించారు. హార్టికల్చర్‌లో భాగంగా వేసిన జామ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఎంపీడీవో ఎం రంగసుబ్బయ్య, హౌసింగ్ ఏఈ అంజిరెడ్డి, అగ్రికల్చర్ ఏవో పెద్ద వెంకటేశ్వర్లు, ఏపీవో కందుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి సురేష్ పర్యటన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండలంలోని తోకపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయబడిన రెస్టారెంట్‌ను ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని మంత్రి వ్యక్తిగత పిఏ ప్రభాకర శర్మ సోమవారం తెలిపారు. అనంతరం పుల్లలచెరువు మండలం ఎండ్రపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం పెద్ద పీఆర్సి తండా గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం మార్కాపురం బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

'మంత్రి నాగేశ్వరరావు వ్యాఖ్యలు సరికాదు'

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో జరిగిన అఖిలభారత యాదవ మహాసభలో పాల్గొన్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీకి చెందిన తర్లుపాడు టిడిపి మండల ఉపాధ్యక్షులు, మంగళకుంట మాజీ సర్పంచి నంబుల లక్ష్మయ్య మాట్లాడారు. యాదవుల మహాసభ పార్టీలకు అతీతంగా జరిగిందన్నారు. ఆ వేదికపై పాల్గొన్న మంత్రి నాగేశ్వరరావు యాదవుల అభివృద్ధి గురించి, ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయం అందిస్తారో చెప్పాలే గానీ... ఈ మహాసభ వేదికగా టిడిపి నాయకుడు లోకేష్‌ను, ఆయన చేపట్టిన పాదయాత్రపై కామెంట్లు చేయడం సరికాదన్నారు. పాదయాత్ర రోజున తారకరత్న గుండెపోటు గురికావడం, సినీ నటి జమున చనిపోవడానికి సంబంధం లేదన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్.మౌలాలి, ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, టిడిపి బిసిసెల్ పట్టణ అధ్యక్షులు పిన్నిక శివ, మాజీ కౌన్సిలర్ కనిగిరి బాలవెంకటరమణ, టిడిపి రాష్ట్ర నాయకులు మట్టం వెంకటేశ్వర్లు, కంచర్ల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

'దేవిరెడ్డి' మృతి పార్టీకి తీరని లోటు: ఉగ్ర

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని మొగల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి గోపయ్య గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం దేవిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఇంద్ర భూపాల్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి, పల్లాటి కోటిరెడ్డి, సోఫిరాల వేణుగోపాల్, గోనా ప్రతాప్, బైసాని సుబ్రహ్మణ్యం, సోమిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో

రోడ్డెక్కిన విరాట్‌నగర్ మహిళలు

ప్రజాశక్తి-పొదిలి

ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

మంచినీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక విరాట్‌నగర్ మహిళలు రోడ్డుపై బైఠాయించి.. నిరసన తెలిపారు. రోజురోజుకూ తమ కాలనీలో నీటి సమస్య పెరుగుతుండటంతో స్థానికులకు నీరు అందడం లేదన్నారు. ఇటీవల కొన్ని రోజుల క్రితం పొదిలిలో కలెక్టర్ పర్యటనలో భాగంగా విరాట్‌నగర్ వాసులు కలెక్టర్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తక్షణం నీటి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించినా పట్టించుకున్న వారు లేరని మహిళలు విలేకరుల వద్ద వాపోయారు. గతంలో డిప్ బోర్ మరమ్మత్తులు చేస్తామని సంబంధించిన వ్యక్తులు ఇంటికి రూ.వెయ్యి నుండి రెండు వేల వరకు వసూలు చేశారని ఆరోపించారు. నీటి సమస పరిష్కారం కాకపోవడంతో ఆగ్రహించిన మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి తమ నీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

జీవో నెం.1ని రద్దు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి

ప్రజాశక్తి-కొండపి

ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జీవో నెంబర్ 1ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సిఐటియు కొండపి మండల కమిటీ సమావేశం యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటిని అనాలోచితంగా విడుదల చేయటం జరిగిందన్నారు. రోడ్లపైన సభలు, సమావేశాలు పెట్టకుండా జీవో ఇవ్వడం అంటే ప్రజాస్వామ్య హక్కులను దాడి చేయడంగా అభివర్ణించారు. కొన్ని ఘటనలు ఆధారం చేసుకొని ఇలా జీవో ఇవ్వడం సరికాదన్నారు. వెంటనే జీవోని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు గడ్డం వందనం, సిఐటియు మండల కోశాధికారి వై.రూబెన్, కెవిపిఎస్ మండల కార్యదర్శి కాలే మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గంటెనపల్లి శ్రీనివాసులు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సుబ్బారావు

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక దాచూరి రామిరెడ్డి భవనంలో జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. బి.వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ప్రజాహక్కులను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకటరావు, బి ఓబులేషు, టి శ్రీను, పి ఏడుకొండలు, యోహాన్, కోటేశ్వరరావు, అభి, కనకరాజు, పాండు, శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

అన్నదానం అభినందనీయం: కుందురు

ప్రజాశక్తి-పొదిలి

నగర పంచాయతీ కార్మికులకు వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్మికులకు ఆంజనేయులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కసిరెడ్డి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, మాదాలవారిపాలెం పిఏసిఎస్ అధ్యక్షులు కొత్తపులి బ్రహ్మారెడ్డి, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు ఎస్‌కె నూర్జాహాన్ బేగం, మహబూబ్ బాషా, ఫిరోజ్, నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధికి చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కుష్టు వ్యాధికి చికిత్స అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోను, ప్రభుత్వ ఆసుపత్రులలోను ఉచితంగా లభిస్తుందని సర్పంచ్ ఆరావత్ అరుణాబాయి తెలిపారు. సోమవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో వైద్య జిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి, ఏఎన్ఎంలు సంధ్యారాణి, స్వర్ణలత, వాలంటీర్లు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని మిట్టపాలెం గ్రామంలో వెలసిన శ్రీనారాయణ స్వామి వారి దేవస్థానంలో సోమవారం ఉదయం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మెయిన్ హుండీల ద్వారా రూ.6,44,043 నగదు, వెండి 3 కేజీలా 779 గ్రాములు, బంగారం 123 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు జి.వి.సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, కోవిలంపాడు ఎంపిటిసి గొను సరస్వతి, వెంకటేశ్వర్లురెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు మంచికంటి మధుసూధనరావు, జిలకర అంజనాదేవి, నారాయణమూర్తి, ఎలిశా నాగమణి, నాగేశ్వరరావు, ముడుమాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అలివేలమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

మండలంలోని మంగమూరు గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరురాలు ఎర్రమనేని అలివేలమ్మ సంతాప కార్యక్రమం గ్రామంలో సోమవారం జరిగింది. తొలుత అలివేలమ్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య, జాలా అంజయ్య, పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కే.మాబు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, కంకణాల ఆంజనేయులు, మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు సిపిఐ ఎంఎల్ నాయకులు డివిఎన్ స్వామి, సిపిఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, రిటైర్డ్ ఆర్‌జెడి టి.గోపాలరెడ్డి పాల్గొన్నారు.

1న జరుగుమల్లి మండల సమావేశం

ప్రజాశక్తి, జరుగుమల్లి

జరుగుమల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 10-30 గంటలకు ఎంపిపి బెల్లం నిర్మల అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ పి.రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

చిన్నమ్మాయి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కొండపి

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

మండలంలోని చిన వెంకన్నపాలెంలో తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులు బొబ్బూరి శ్రీను అత్త చిన్నమ్మాయి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. సోమవారం దశదిన కర్మ కార్యక్రమంలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొని.. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొర్రెపాటి రామయ్యచౌదరి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాధవరావుకు పురస్కారం అందజేస్తున్న కెఆర్ ఫౌండేషన్ నాయకులు

మద్దాళి మాధవరావుకు పురస్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తికి చెందిన అభయకళ ఫౌండేషన్ అధ్యక్షులు మద్దాళి మాధవరావుకు కెఆర్ ఫౌండేషన్, లిటిల్ చాంప్స్ సంస్థలు డాక్టర్ బాబూరాజేంద్రప్రసాద్ స్ఫూర్తిసేవా పురస్కారం, నటశేఖర కృష్ణ పురస్కారాలు అందజేశారు. మద్దాళి మాధవరావు వివిధ రంగాలలో అందించిన సేవలకు గుర్తింపుగా ఒంగోలులోని ఏకెవికె కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్, హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా అధ్యక్షులు నల్లూరి శ్రీనివాసులుకు సేవా పురస్కారాన్ని అందజేశారు. నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవలకు గుర్తింపుగా పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ కార్యదర్శి బుచ్చేశ్వరరావు, మిస్ ఇండియా హేమప్రియ, వర్ధమాన నటి టీనాచౌదరి పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

మండలంలోని అయినముక్కలలో క్రైస్ట్ చర్చిలో జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ మార్కాపురం వారి ఆధ్వర్యంలో సేవా భారత్ వారు సోమవారం హెల్త్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ షేక్ ఖాదర్ రసూల్ పాల్గొని ఆరోగ్య రక్షణ విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ఫౌండర్ మరియు డైరెక్టర్ రెవ డాక్టర్ గుర్రం శేఖర్, సేవా భారత్ కో ఆర్డినేటర్ స్టీవెన్, జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ కో ఆర్డినేటర్ యమ్‌యస్ విజయకుమార్ పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

- ఘనంగా గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి-రేపల్లె

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీ చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో తహశీల్దారు కార్యాలయం పలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యాసంస్థలలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగన్నాథం పార్ధసారథి మాట్లాడుతూ అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని ఆర్డీవో అన్నారు. నిత్యం అహింసాయుత మార్గంలో సత్యమే పరమావధిగా జీవించారని.. అదే మార్గంలో భారతావనికి స్వాతంత్ర్యం అందించారని కొనియాడారు. 1948 జనవరి 30న బిర్లా హౌస్ వద్ద నాథూరామ్ గాడ్సే మహాత్ముడిపై కాల్పులు జరపగా.. హే రామ్ అంటూ జాతిపిత ప్రాణాలు విడిచారని ఆర్డీవో అన్నారు. మహాత్ముడి వర్ధంతిని దేశవ్యాప్తంగా షహీద్ దివస్‌గా జరుపుకుంటున్నామని, ప్రజలంతా గాంధీజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్డీవో జగన్నాథం పార్ధసారథి పిలుపునిచ్చారు. జాతి సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీజీ అనుసరించిన శాంతియుత మార్గం అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు.

అద్దంకి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అద్దంకి మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అద్దంకి పురపాలక సంఘం వైస్ చైర్మన్ దేశ్ పద్వేష్, ఊడత సురేష్, కౌన్సిలర్ బాలు, ఊడత ఆదినారాయణ, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు అయితా రాజా, నల్లమల్లి సుబ్రహ్మణ్యం, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ ఆత్మకూరి ఆంజనేయులు, గుంటూరు మాధవ రావు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కూరపాటి రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల సెక్రటరీ జవ్వాజి నాగ మల్లేశ్వరరావు వందన సమర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డివి లలితకుమారి, ఎంపిడిఓ చంద్రశేఖర్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు విశేష కృషి చేశారని అన్నారు. గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా

మహాత్మా గాంధీకి ఆర్‌డిఓ జగన్నాథం నివాళి

తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: గాంధీ వర్ధంతిని ఇంకొల్లు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొట్లబజారులోని గాంధీ విగ్రహానికి వాసవీక్లబ్ అధ్యక్షులు చిన్ని పూర్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డి బదరీనారాయణ, కోశాధికారి నరశింహశెట్టి, అయ్యప్ప స్వామి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పర్చూరు: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పర్చూరు కొట్ల బజారులో, బ్రహ్మంగారి దేవస్థానం వద్ద ఉన్న గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొత్తూరి వెంకటేశ్వర్లు, దారావత్తు మల్లేశ్వరరావు అనే చిరు వ్యాపారులకు రూ.20 వేలు వడ్డీ లేని రుణాన్ని రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు మామిడిపాక హరిప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు శ్రీరాం వెంకటసుబ్బారావు, ఎం కిరణ్, రంగా సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం గాంధీజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఉప్పుగుండూరు గ్రామంలో వాసవిక్లబ్ సామాజిక సేవా కార్యకర్త టి శామ్యూల్ ఆధ్వర్యంలో గ్రంధాలయ కూడలిలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గాంధీజీని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగుండూరు సొసైటీ చైర్మన్ య శ్రీనివాసప్రసాదు, వాసవిక్లబ్ అధ్యక్షుడు దేసు సుధాకర్, పులకంఠ రాజ, అమరావేణు, జి త్యాగరాజు, వజ్రంబాబు తదితరులు పాల్గొన్నారు.

చీరాల: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మాగాంధీ మహనీయుడని పేరాల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి సాల్మన్ పేర్కొన్నారు. సోమవారం గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా పేరాల హైస్కూల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేత కర్రబట్టి, నూలు వడికి, మురికివాడలు శుభ్రం చేసి, అన్ని మతాలు, కులాలు ఒక్కటే అని గాంధీజీ పేర్కొన్నారని వెల్లడించారు. 1948 జనవరి 30న ఢిల్లీలోని బిర్లా నివాసం వద్ద ప్రార్ధనా మందిరానికి వెళ్తుండగా ఆయనను నాథూరామ్ గాడ్సే కాల్చి చంపాడని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ, భానుచంద్ర, వెలుగొండారెడ్డి, చంద్రశేఖర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో జరగని గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి-పంగులూరు

బోసిపోయిన మహాత్మాగాంధీ విగ్రహం

అహింసా నినాదంతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సంపా దించి పెట్టిన మహాత్మాగాంధీని పంగులూరులో అధికారులు మరిచి పోయారు. గాంధీ వర్ధంతిని భారతదేశ ప్రజలంతా సోమవారం నాడు జరుపుకోగా, పంగులూరు లో ఆ ఊసే కనపడలేదు. ప్రతి ఏటా గాంధీ జయంతిని, వర్ధంతిని ఘనంగా జరుపుకునే పంగులూరు వాసులు ఈ సంవత్సరం ఆ కార్యక్రమాన్ని జరుపుకోకపోవడం చర్చనీ యాంశమైంది. మండల కేంద్రమైన పంగులూరులోని సచివాలయం-1 పక్కనే మహాత్మా గాంధీ విగ్రహం ఉంది. దీనిని 1970వ సంవత్సరంలో ఇక్కడ ప్రతిష్టించారు. అప్పటినుంచి గాంధీ జయంతిని గాని, వర్ధంతిని గాని ఘనంగా జరిపేవారు. గ్రామంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, రోటరీ పెద్దలు, గ్రామ పెద్దలు ఎంతో గౌరవంగా నిర్వహించేవారు. విగ్రహానికి పూలమాలవేసి దేశ స్వాతంత్ర పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్రను గురించి వివరించేవారు. అయితే ఈ సంవత్సరం కనీసం విగ్రహానికి పూలమాల వేసిన దాఖలాలు కూడా లేవు. గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, రోటరీ పెద్దలు, గ్రామపెద్దలు కూడా ఆయనను పూర్తిగా మర్చిపోయారు. దీంతో గాంధీజీ విగ్రహం బోసిపోయినట్లు కనపడుతోంది. ఈ పరిణామం పట్ల కొందరు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులను మరవకుండా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ పద్మజ

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం కంబైన్డ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సోమవారం భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డివెల్ పద్మజ పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆహార పదార్థాలు అత్యంత పోషక విలువలు కలిగినవని పేర్కొన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. అలాగే బరువు తక్కువగా ఉన్న పిల్లలకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలు-1 సచివాలయ పరిధిలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన హుస్సేన్‌బేగ్ కుటుంబానికి బీమా అర్హత ఉండటంతో భార్య రిజ్వానాకు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. మిగిలిన బీమా సొమ్మును మంజూరు కాగానే అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొతారపు పద్మావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ వాగోలు సురేష్, వార్డు సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

3న మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఫిబ్రవరి (వచ్చే నెల) 3వ తేదీన మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నిక ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం సాంబశివరావు తెలిపారు. ఈ ఎన్నిక ప్రిసైడింగ్ అధికారి సరోజిని అధ్యక్షతన జరుగుతుందని ఆయన అన్నారు. ఈ పదవికి గతంలో ఎంపీపీగా పనిచేసిన అట్లా చిన్న వెంకటరెడ్డి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్నిక జరగనుంది. మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు, 20 గ్రామ పంచాయ తీలు ఉన్నాయి. అన్ని ఎంపీటీసీ స్థానాలు వైసీపీ ఖాతాలోనే ఉన్నాయి. 20 గ్రామ పంచాయతీలను గాను వాటిలో కామేపల్లి గ్రామపంచాయతీ టిడిపి మినహా, మిగతా 19 గ్రామ పంచాయతీల్లో వైసిపికి చెందిన సర్పంచులు ఉన్నారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ అధ్యక్ష పదవి ఎన్నికపై వైసిపిలోని రెండు వర్గాల నాయకులు మల్లగుల్లాలు పడుతు న్నారు. ఇటీవల నరసరావుపేట, అద్దంకి పట్టణాలలో వైసిపి నాయకుల మధ్య రహస్య సమావేశాలు కూడా కొనసాగాయి. అధ్యక్ష పదవిపై స్థానిక కీలక నేతలు తమకు అనుకూలమైన ఎంపీటీసీ సభ్యున్ని అధ్యక్షుడిగా ఎంపిక చేసేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

జీవో ఒకటిపై ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-మేదరమెట్ల

మేదరమెట్ల గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జీవో నెంబరు ఒకటిపై సోమవారం నిరసనను తెలియజేశారు. స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఒకటో నెంబర్ జీవో ఎంత దారుణమైనదో వక్తలు వివరించారు. గాంధీ ఆశించినటువంటి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను హరింపచేసే విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తయారు చేసిన జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు, ముస్లిం మైనారిటీ ఉమ్మడి ప్రకాశం ఉపాధ్యక్షులు సయ్యద్ సర్దార్ ఖాన్, సిఐటియు మండల బాధ్యులు వై రవీంద్రబాబు, రైతు సంఘం మండల బాధ్యులు శావా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి-చీరాల

మహిళా సాధికారికతను సాధించినప్పుడే దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందని చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్ పేర్కొన్నారు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, మహీంద్రా ప్రైడ్, నాంది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో మహిళలకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ కార్యక్రమం ప్రారంభ మైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారని తెలిపారు. ఎంతో కష్టమైన ఆర్మీ నుంచి అంతరిక్షం వరకు అన్ని చోట్ల తమదైన ముద్రతో దూసుకుపోతున్నారని అన్నారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని చెప్పారు. బాలికలకు ఉద్యోగ శిక్షణ ఇవ్వటానికి మహేంద్ర ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో ఇస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రోగ్రాం ట్రైనర్ పి అన్వేష్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ఆరు రోజులు ఉంటుందన్నారు. ఇందులో విద్యార్థులకు ఇంగ్లీషులో మాట్లాడటం పర్సనాలిటీ డెవలప్మెంట్, ఇంటర్వ్యూలను ఎలా ఫేస్ చేయాలి తదితర అంశాలలో నిపుణుల చేత సంపూర్ణ శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ బాజీ సాహిద్, వివిధ శాఖల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్

దేశాన్ని దోచుకుంటున్న బిజెపిని సాగనంపుదాం

ప్రజాశక్తి-చీరాల

కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న దేవరపల్లి రంగారావు

నిత్యావసర ధరలను పెంచడమే కాకుండా మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని చీరాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరపల్లి రంగారావు అన్నారు. సోమవారం రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర ముగింపు సందర్భంగా చీరాల ముక్కోణం పార్క్ సెంటర్లో ఉన్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీరాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దేవరపల్లి రంగారావు ఆధ్వర్యంలో పీసీసీ సభ్యులు అలీం బాబు, పట్టణాధ్యక్షులు బండ్లమూడి విజయ్ కుమార్, కరెద్దుల సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షురాలు హనీగ్రేస్‌లు కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు నిర్వహించిన జోడో పాదయాత్ర నేడు జమ్మూకాశ్మీర్‌లో ముగుస్తుందని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని భారతదేశం అంతటా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ తాకట్టు పెట్టుకుంటూ వస్తున్నారని విమర్శించారు. దేశాన్ని సైతం అమ్ముకునే దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవన్నారు. దేశప్రజలు బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న శ్రీరామశ్రీనివాసరావు

కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి వేతన సవరణ చేయాలని సిఐటియు నగర వర్కింగ్ సెక్రటరీ శ్రీరామ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 సంవత్సరంలో అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ కోసం కొంతమంది కార్మికులను తీసుకున్నారన్నారు. 2020 మార్చిలో కరోనా రావడంతో పనుల కోసం కార్మికులను నూటికి 20 మంది ని తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అధికారులు కొత్తగా కార్మికులను తీసుకోకుండా అప్పటికే తీసుకున్న కార్మికుని కోవిడ్‌లో చూపించారని, ఈ విషయమై అనేకసార్లు కలెక్టర్ దష్టికి తీసుకెళ్ళామన్నారు. కరోనా సమయంలో కూడా ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేసిన కార్మికులను ఆప్కాస్ చేర్చి వేతన సవరణ చేయాలని ఆయన కోరారు. ధర్నా కార్యక్రమంలో కోవిడ్ కార్మికులు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సైన్స్ ద్వారానే సమాజ ప్రగతి

జెవివి శిక్షణా తరగతుల్లో డాక్టర్ కాలేషాబాషా

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

భవిష్యత్తులో కూడా సమాజ ప్రగతికి, మానవ మనుగడకు, మెరుగైన జీవనానికి సైన్స్ మాత్రమే ఆధారమవుతుందని డాక్టర్ కాలేషాబాషా పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గిద్దలూరులోని అభిలాష్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన శిక్షణా తరగతులలో ముఖ్య వక్తగా మాట్లాడారు. శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్ హాజరైన జనరల్ సర్జన్, జెవివి జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ప్రశ్నించడం ద్వారానే సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని, ప్రశ్నించినప్పుడే హేతుబద్ధమైన సమాధానం దొరుకుతుందని అన్నారు. శిక్షణా తరగతుల ప్రారంభ సభకు డి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు పి.స్వరూపరెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం జెవివి రాష్ట్ర కమిటీ ప్రచురించిన అంతరిక్ష విజ్ఞానం పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామూరి రమణారెడ్డి, పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ భూమా బాలనర్సింహారెడ్డి, డాక్టర్ జెవి.నారాయణ, డాక్టర్ జి.సుదర్శన్‌రెడ్డి, జెవివి నాయకులు కుర్రా రామారావు, ఖాజాహుస్సేన్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

రూ.45 లక్షలు చెల్లించని..

మొక్కజొన్న విత్తనాల వ్యాపారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

రైతుల నుండి కొనుగోలు చేసిన మొక్కజొన్న విత్తనాలకు సంబంధించి రూ.45 లక్షల నగదు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న వ్యక్తులపై రైతులు ఫిర్యాదు చేశారు. మార్టూరు ఎస్ఐ రవీంద్రారెడ్డి సోమవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కోలలపూడి గ్రామానికి చెందిన వల్లెపు శ్రీనివాసరావు స్థానికంగా రైతుల నుండి మొక్కజొన్న, తదితర అపరాలు కమిషన్ పద్ధతిపై వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రం, చిక్ బళ్లాపూర్ జిల్లా కేంద్రానికి చెందిన కె.కష్ణవేణి, ఆమె భర్త వెంకటేష్, వారి కుమారుడు గోవర్ధన్, వెంకటేష్ తండ్రి శ్రీనివాస్ 2022 సంవత్సరం జూన్ నెలలో కోలలపూడి గ్రామం వచ్చి రైతుల నుండి మొక్కజొన్నలు తమకు విక్రయిస్తే పది రోజులలో నగదు చెల్లిస్తామని నమ్మించారు. వారిని నమ్మి కమిషన్ ఏజెంట్ వల్లెపు శ్రీనివాసరావు రూ.45,50,000 విలువైన పదిహేను లోడుల మొక్కజొన్న విత్తనాలను రైతుల నుండి వ్యాపారులకు సప్లై చేశాడు. అప్పటినుండి ఎన్ని సార్లు నగదు చెల్లించమని కష్ణవేణి కుటుంబసభ్యులను అడిగినా స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించిన శ్రీనివాసరావు మరొక ప్రక్క స్థానిక రైతుల నుండి ఒత్తిడి పెరిగిపోవడంతో బాధిత కమిషన్ రైతు మార్టూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారులు నిర్లిప్తత వీడాలి..

- మీ బాధ్యతను విస్మరించడం పద్ధతి కాదు
- కలెక్టర్ కె.విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అధికారులు నిర్లిప్తత వీడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కె.విజయకష్ణన్ ఆదేశించారు. జిల్లా అధికారులతో సోమవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్పందన పోర్టల్ మాదిరిగానే 'జగనన్నకు చెబుదాం' పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జనవరి రెండో తేదీ నుంచి ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన 66 ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు చూడకపోవడంపై కలెక్టర్ అసంతప్తి వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ లో వస్తున్న ఫిర్యాదులను పట్టించుకోకపోతే కుదరదన్నారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి ఈ వెబ్ సైట్ అనుసంధానించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మీరు నిర్వర్తించాల్సిన విధులను కూడా పలుమార్లు చెప్పించుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ముందుగా అధికారులు నిర్లిప్తత వీడాలని హెచ్చరించారు. విధుల నిర్వహణలో మీ బాధ్యతను విస్మరించడం పద్ధతి కాదన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాధితులకు తక్షణ న్యాయం కోసం కమిటీ

గ్రామాల్లో బెదిరింపులు, అన్యాయానికి గురైన బాధితులకు తక్షణమే న్యాయం చేయడానికి ముగ్గురు జిల్లా అధికారులతో ఒక కమిటీని జిల్లా కలెక్టర్ నియమించారు. అందులో డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు, కార్మిక శాఖ అధికారి శివప్రసాద్, డిఎల్‌డీఓ సిహెచ్.సువార్తఉంటారని తెలిపారు. క్షయ వ్యాధి నివారణ అవగాహన, ముందస్తు జాగ్రత్త చర్యలతోనే సాధ్యమని జిల్లా కలెక్టర్ చెప్పారు. క్షయ వ్యాధి నివారణపై రూపొందించిన ఫ్లెక్సీలు, బ్రోచర్లను కలెక్టర్ విడుదల చేశారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి షేక్ అబ్దుల్ సత్తార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'చేదోడు' సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఇచ్చే జగనన్న చేదోడు ఆర్థిక సాయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్ లోని డి.ఆర్.సి సమావేశం హాలులో జగనన్న చేదోడు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పథకాలను వినియోగించుని అభివద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు రూ.9.33 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కుల డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, రాష్ట్ర వన్య కుల డైరెక్టర్ కె.మమిడయయ్య, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్‌రావు, బి.సి కార్పొరేషన్ పరిపాలనా అధికారి బి.వి.ఎన్. మూర్తి పాల్గొన్నారు.

బతికుండగానే రికార్డుల్లో చంపేశారు..

- డ్వాక్రా గ్రూప్‌లో వెలుగుచూసిన అక్రమం
- బాపట్ల కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన బాధితురాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

డ్వాక్రా గ్రూప్‌లో మరొక సభ్యురాలిని చేర్పించడానికి తాను బతికి ఉండగానే మరణించినట్లు సష్టించి.. గ్రూప్ నుండి తొలగించారని..సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలైన డ్వాక్రా గ్రూప్ సభ్యురాలు బాపట్ల జిల్లా కలెక్టర్‌కి సోమవారం ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబం, ద్రోణాదుల యానిమేటర్ ఫణికుమారి, మార్టూరు ఎపిఎం జి.రాజారత్నం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన పల్లపు శ్రీదేవి లక్ష్మీతిరుపతమ్మ డ్వాక్రా గ్రూప్‌లో గత కొన్ని సంవత్సరాలుగా సభ్యురాలిగా కొనసాగుతోంది. ఇటీవల గ్రూప్‌లోని పది మంది సభ్యులకు స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.10 లక్షల లోను మంజూరు కాగా ఆ నగదుని సభ్యురాలైన శ్రీదేవికి ఇవ్వకుండా వేరే మహిళకు ఇచ్చినట్లు తెలుసుకున్న శ్రీదేవి యానిమేటర్ ఫణికుమారి, సిసి దష్టికి తీసుకెళ్లింది. దీంతో యానిమేటర్ ఫణికుమారి గ్రామంలో జరిగిన ఘటనపై ఆరా తీయగా స్థానిక వీఏవో భర్త పోపూరి వెంకట్రావు తమ సమీప బంధువైన ఓ మహిళకు లోను ఇప్పించటం కోసం ఈ పని చేసినట్లు ఫణికుమారి చెప్పటం గమనార్హం. వెలుగు కార్యాలయంలోని ఆన్‌లైన్ రికార్డులలో తన పేరు ఇప్పటికీ ఉండగా తాను మరణించినట్లు తప్పుడు ప్రచారం చేసి.. తనకు రావలసిన రూ.లక్ష లోను అందకుండా చేసిన సంబంధిత వ్యక్తులు, వెలుగు కార్యాలయ సిబ్బంది, ఎపిజిబి మేనేజర్‌పై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు శ్రీదేవి కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు ఫిర్యాదు చేసింది. కాగా ఈ విషయమై మార్టూరు ఎపిఎం రాజారత్నంను విలేకరులు వివరణ కోరగా జరిగిన సంఘటన తన దష్టికి రాలేదని, కింది స్థాయి సిబ్బంది ద్వారా ఘటన జరిగిందని, విఏఓ భర్త ఈ పని చేసినట్లుగా తన దష్టికి వచ్చినట్లు యానిమేటర్ తెలిపిందని చెప్పారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

షెడ్ల నిర్మాణానికి స్థలం పరిశీలన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని కాట్రగుంట, కొనకనమిట్ల, పెదారికట్ల గ్రామా లకు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్యూల్ నిర్మాణానికి స్థలాన్ని సోమవారం ఎంపిడిఒ రావూరి జనార్ధన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్లు మంజూరయ్యాయన్నారు. త్వరలో వీటి నిర్మాణానికి భూమి పూజ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పెదారికట్లలో షెడ్డు నిర్మాణానికి భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంచయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వాలంటీర్ల సంఘం అధ్యక్షులు బాలచంద్రుడు, నాయకులు కొండారెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

అర్జీలు క్షేత్రస్థాయిలోనే పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్పందన అర్జీలను నిర్దిష్ట గడువులోపు సహేతుకంగా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన', 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమంలో ప్రజల నుంచి విజ్ఞప్తులను, ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో 199 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తిస్తే సదరు అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవిన్యూ సమస్యలకు సంబంధించిన పిటీషన్లను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని పరిశీలించాలని ఆయన పునరుద్ఘాటించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీ ఎం. అభిషేక్ కిషోర్ డి.ఆర్.ఓ. బి.చిన ఓబులేసు, స్పెషల్ 2 డిప్యూటీ కలెక్టర్లు గ్లోరియా, ఉమాదేవి, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ లోకేష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

విధుల నిర్వహణలో నైపుణ్యం పెంచుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్పందన హాలులో ఇద్దరికి కారుణ్య కోటాలో ఉద్యోగ నియామక పత్రాలను ఆయన అందించారు. యు.సురేష్ భార్య వాణికి డి.ఆర్.ఓ. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా, హరిబాబు కుమార్తె ఎం.హరి చందనకు జిల్లా ఆడిట్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.